

నెల్లూరు : వెండి నందిపై కొలువుదీరిన భువనేశ్వరీ సమేత మూల స్థానేశ్వరుడు



నెల్లూరు : సాయంసంధ్యవేళ స్వర్ణలింగేశ్వర స్వామి సన్నిధిలో అద్భుత దృశ్యం

శంభో శివశంభో

భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి ● మారుమోగిన ఓంకారనాథం

ఊరూ వాడ.. శైవక్షేత్రలయ్యాయి. ప్రతి గొంతూ శివనామం జపించింది. ప్రతిపాదం హరుడి ఆలయం వైపు కదిలింది. హరహర శంకర శంభో.. ఓం నమఃశివాయ... నమః పార్వతీ పతయే!.. శంభో శంకర... శంభో శివశంభో.. నామస్మరణలతో శైవాలయాలు మారుమోగాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అభిషేక ప్రియుడికి విశేష అభిషేకాలు జరిగాయి. ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవాయిద్యాల నడుమ ఆదిదంపతుల కల్యాణం కనులపండువగా జరిగింది. మైపాడు, ఇసుకపల్లి, కాటేపల్లి, రామతీర్థం తదితర తీరప్రాంతాల్లో సముద్ర స్నానం ఆచరించి, భక్తి శ్రద్ధలతో పరమేశ్వరుడిని పూజించారు.

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శైవ క్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే సముద్రతీరం, నదీతీరాలు పుణ్యస్నానాల కోసం వచ్చిన భక్తులతో కళకళలాడాయి. శైవ ఆలయాల్లో పాలభిషేకాల కోసం భక్తులు బారులు తీరారు. రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు విస్తృతంగా జరిగాయి. గిన్నెభిక్ష ఉత్సవాలు వేడుకగా జరిగాయి. ఉదయం, సాయంత్రం జరిగిన ఈ పూజలకు భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. దానధర్మాలు, అన్నదాన కార్యక్రమాలు, భారీ ప్రసాద వితరణలు జరిగాయి. నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని అన్ని ప్రముఖ క్షేత్రాలలో రాత్రి లింగోద్భవ అభిషేకాలు అర్ధరాత్రి వరకు జరిగాయి. అనంతరం శివపార్వతులు వెండినందిపై కొలువుదీరి పేట, నగరోత్సవాలకు తరలివెళ్లారు. తమ ముంగిటకు వచ్చిన ఆదిదంపతులకు భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి దర్శించుకున్నారు. అన్ని మండలాల్లో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలు పోటెత్తిపోయాయి. కొండల్లో కోనల్లో వెలిసి వున్న శివయ్యలను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

● నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో బుధవారం తెల్లవారుజాము 2గంటల నుంచి ప్రజలు పాలభిషేకాలు చేయించుకునేందుకు బారులు తీరారు. మహాన్యాస రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారికి గిన్నెభిక్ష ఉత్సవం జరిగింది. మహాన్యాస రుద్రహోమం అలంకారం, విశేష పూజలు జరిగాయి. రాత్రి 10 గంటల వరకు దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయం పోటెత్తింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పూలంగిసేవ, కుంభ హారతులు, లింగోద్భవ అభిషేకాలు జరిగాయి. అనంతరం భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామికి వెండినందిపై నగరోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఉత్సవ అధికారి, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



1. సంగం : భీమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం
2. కావలి : ప్రత్యేక అలంకరణలో పార్వతీసమేత పంచభూతేశ్వర స్వామి
3. సంగం : కామాక్షిదేవి మూలవిరాట్‌కు వెన్నతో అలంకరణ
4. మూలాపేట శివాలయంలో దీపారాధన
5. బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో వెండినందిపై ఆదిదంపతులు



నెల్లూరు : మూలస్థానేశ్వర ఆలయంలో భక్తులు



సీతారామపురం : ఘటిక సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద..



లింగసముద్రంలో కోటయ్యస్వామి సన్నిధిలో..



కావలిలో శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



సీతారామపురం : భైరవకోనలో భక్తజనం



ఇందుకూరుపేట : మైపాడు తీరంలో భక్తులు

ఆ భూములపై విచారణ ప్రారంభం

● రైతుల నుంచి ధ్రువపత్రాల స్వీకరణ

కలువాయి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగారిపల్లె, మాదన్నగారిపల్లెల్లోని పేదల భూములపై రెవెన్యూ బృందాలు బుధవారం విచారణ ప్రారంభించాయి. ఐదు బృందాలుగా ఏర్పడిన సిబ్బంది భూములను పరిశీలించడంతోపాటు రైతుల వద్ద ఉన్న అసైన్‌మెంటు పట్టాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1బి అడంగల్ వంటి ధ్రువపత్రాల నకలును తీసుకొంటున్నారు. మాదన్నగారిపల్లె రెవెన్యూ పరిధిలోని ఈ రెండు గ్రామాల్లో జగన్ ప్రభుత్వం చేసిన రీ సర్వేలో జరిగిన తప్పులు కారణంగా పేద రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు గ్రామాల్లో వందల ఏకరాల ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయిస్తూ అసైన్ చేశారు. ఈ భూముల్లో పలు ప్రభుత్వ పథకాల్లో బోర్లు, బావులు తవ్వకుని వారు పైర్లు సాగు చేసుకుంటున్నారు. అయితే రీ సర్వే సందర్భంగా అధికారులు ఈ భూముల కేటాయింపు చెల్లదని వాటిని ప్రభుత్వ భూములుగా రికార్డులలో నమోదు చేశారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఈనెల 22న ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ఓ కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. ఆత్మకూరు ఆర్డీవో పావని ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ప్రతి రైతు భూమి వద్దకు వెళ్లి వచారిస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.



రామన్నగారిపల్లెలో రైతులను విచారిస్తున్న రెవెన్యూ సిబ్బంది


రుణాలిప్పిస్తాం.. రండి!
దళారుల దందా!

● సబ్సిడీ లోన్లు ఇప్పిస్తామని బ్రోకర్ల రంగప్రవేశం
● ఒక్కో రుణానికి రూ.30 వేలు ఇచ్చేలా ఒప్పందం
● అడ్వాన్స్‌గా రూ.5 వేల నుంచి 10 వేలు వసూలు
● రాజకీయ, కుల సంఘాల ముసుగులో దోపిడీ

"మాకు ఆ ఎమ్మెల్యే తెలుసు. ఆ పార్టీలో ఆ పెద్ద నాయకుడు నాకు బాగా పరిచయం. ఉన్నతాధికారితో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. కాబట్టి మీకు రుణం త్వరగా ఇప్పిచ్చే బాధ్యత నాది. మీకు వచ్చే లోన్‌లో రూ.30వేలు ఇస్తే చాలు. అన్నీ నేను చేసేస్తా.'

- దళారులు చెబుతున్న మాటలు ఇవి

నెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పేదల బలహీనతను కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉన్నత లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలను మంజూరు చేయగా, వాటిని ఇప్పిస్తామంటూ ఆశ చూపుతున్నారు. ఇందుకు కొంత ఖర్చవుతుందంటూ వసూళ్ల పర్వానికి తెరలేపుతున్నారు. రాజకీయ, కుల సంఘాల ముసుగులో దోపిడీదారులు ఈ మోసానికి పాల్పడుతున్నారు. ఐదేళ్ల తర్వాత సబ్సిడీ రుణాలు మంజూరవుతుండటంతో పేదలు ఎగబడుతున్నారు. దీనినే మోసగాళ్లు అవకాశంగా మలుచుకుంటున్నారు. గతంలోనూ ఇటువంటి సంఘటనలు జిల్లాలో జరగడం, అప్పట్లో కేసులు కూడా నమోదు చేయడం గమనార్హం. గరిష్ఠంగా ఒక్కో స్వయం ఉపాధి యూనిట్ విలువను రూ.5 లక్షలుగా నిర్ణయించారు. అందులో 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందించనుంది. ఈ నేపథ్యంలో రుణం మంజూరుకు దళారులు కొంత పర్సంటేజీ మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా ఒక్కో యూనిట్‌కు రూ.30 వేల వరకూ అడుగుతు న్నట్లు సమాచారం. ఇందులో అడ్వాన్స్‌గా రూ.5 వేల నుంచి 10 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే కొందరు దళారులు దరఖాస్తు దారుల నుంచి వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో దిగిన ఫొటోలను ప్రచారం చేసుకుంటూ తమకు పలుకుబడి ఉన్నట్లు నమ్మించి మోసానికి పాల్పడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. కొందరైతే ఏకంగా బీసీ, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాలకు దరఖాస్తుదారులను తీసుకెళుతున్నట్లు తెలుస్తోంది. అక్కడ వారికి పరిచయమున్న ఒకరిద్దరు ఉద్యోగులతో మాట్లాడిస్తూ 'మీకు లోన్ మంజూరవుతుంది. భయపడాల్సిన పనిలేదు..' అంటూ భరోసా కూడా కల్పిస్తున్నట్లు సమాచారం. త్వరలో తొమ్మిది కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు జరగనున్నాయి. అలానే ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలుకానుంది. ఈ పరిస్థితుల్లో అధికారులతో పాటు దరఖాస్తుదారులు అప్రమత్తమవ్వాల్సిన సమయం ఆసన్నమైంది.



● 2069 యూనిట్లు.. 18,922 దరఖాస్తులు

పేదలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఐదేళ్ల తర్వాత సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. బీసీ కార్పొరేషన్‌తో పాటు ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కుమ్మరి, కాపు కార్పొరేషన్ కింద జిల్లాకు 2069 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందుకు గానూ రూ.43.12 కోట్లను కేటాయించారు. ఒక్కో యూనిట్ విలువ గరిష్ఠంగా రూ.5 లక్షలు కాగా 50 శాతం సబ్సిడీ, మిగిలిన 50 శాతం బ్యాంకు లోన్ ఉంటుంది. బీసీ కార్పొరేషన్ అధికారులు ఈ సబ్సిడీ రుణాలకు ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం 18,922 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా బీసీ కార్పొరేషన్‌లో 1328 యూనిట్లకు 15,036 దరఖాస్తులు, కాపు కార్పొరేషన్‌లో 231 యూనిట్లకు సంబంధించి 1832 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులన్నిటినీ పరిశీలించి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అదే సమయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ కార్పొరేషన్ కింద జిల్లాకు సుమారు 1300 యూనిట్లు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రుణాలకు సంబంధించి త్వరలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

హరహర మహాదేవ..

వైభవంగా మహాశివరాత్రి ● శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు ● శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు



బిట్రగుంట : కల్యాణ వేదికపై గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరుడు

కావలిటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓంకార నాథ.. అంటూ భక్తుల శివ నామస్మరణలతో ఆలయాలు మారుమ్రోగాయి. పట్టణ పరిధిలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. వెంగళరావునగర్, ముసునూరు, మందాటి చెరువు ట్రంకురోడ్డులోని హనుమత్ క్షేత్రంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని పాతూరులో ఉన్న శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ప్రాచీన ఆలయం భక్తులతో పోటెత్తింది. శివదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి శివదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాపార, ప్రజా సేవా సంఘాలు భక్తులకు ఉచితంగా మజ్జిగ, ప్రసాదాలు,



అల్లూరు : హోమంలో పాల్గొన్న బీద గిరిధర్, సుజన దంపతులు

తులసి మొక్కలు పంపిణీ చేశారు.

● కావలిరూరల్ : మండలంలోని గౌరవరంలో వెలసియున్న పార్వతి సమేత పంచభూతేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. విశేష పూజల అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం, పల్లకి పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి అన్నాభిషేకం పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● అల్లూరు : మండలంలోని ఇస్కపల్లిలో వెలసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, హోమాలు, అల్లూరు, నార్తుమోపూరుల్లోని శివాలయాల్లో అత్యంత వైభవంగా విశిష్ట పూజలు నిర్వహించారు. రాత్రి మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. రాత్రి జాగారం చేపట్టి మహా శివుని స్మరించుకుంటూ శివరాత్రి పుణ్య పవిత్రతను చాటారు.

● కొండాపురం : మండల పరిధిలోని గుడవల్లూరు. ఆదిమూర్తిపురం, కొమ్మి, గరిమెనపెంట, తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు వేకువజాము నుండే అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దరించుకున్నారు. విశేష పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కొండాపురంలోని వీరబ్రహ్మంగారి ఆలయంలో స్వామివారికి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే లింగసముద్రంలో వెలసియున్న తిరుమణిశెట్టి కోటయ్య సమాధి దర్శనానికి కొండాపురం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. మహాశివరాత్రి పర్వదినాన తిరుమణిశెట్టి కోటయ్య సమాధిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

● లింగసముద్రం : లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు, సేవాసమితులు, ఆర్యవైశ్యులు మంచినీరు, అన్నప్రసాదం అందజేశారు. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీటి ప్యాకెట్ల పంపిణీని గుడ్లూరు సీఐ మంగారావు, లింగసముద్రం ఎస్సై షేక్ మహబూబ్ సుభానీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, నేతలు అడపా రంగయ్య, మాజీ ఎంపీపీ పీ. బాలకోటయ్య, కిలారి రమణయ్య, జంపాల శివప్రసాద్, ఎలిపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయ నిర్వాహకులు పవని నాగేంద్రప్రసాద్ భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల కోసం కోలాటం, పండరి భజన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సీఐలు మంగారావు, వెంకటేశ్వరరావు, పలువురు ఎస్సైలు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. అలాగే తిరుమణిశెట్టి కోటయ్యస్వా, మొగిలిచెర్ల దత్తాత్రేయ స్వామిలను, గొల్లపాలెం వద్ద నాగదేవతను కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదనరావు యాదవ్ దర్శించుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మండల కన్వీనర్ ఎన్ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు, కళవళ్ల, రోళ్లపాడు, కొండసముద్రం తదితర గ్రామాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులతో పోటెత్తిన ఆలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. దేవాతామూర్తుల విగ్రహాలను రకరకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాలు కనువిందు చేశాయి. వలేటివారిపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఈవో కార్తీక్, అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు దామా మల్లేశ్వరరావు, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాని హర్ష, కాకుమాని ఆంజనేయులు, వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

● కలిగిరి : మండలంలోని సిద్ధకొండూరులోని సిద్ధేశ్వర స్వామి ఆలయం, కలిగిరిలోని పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే కాకర్లసురేష్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. అధిక సంఖ్యలో భక్తుల తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.

● బిట్రగుంట : బోగోలు మండలంలోని శైవక్షేత్రాల్లో పార్వతీపరమేశ్వర్ల కల్యాణం వైభవంగా జరిగింది. నాగులవరంలో గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సందర్శించారు. స్థానిక టీడీపీ నేతలు కాంద్ర సతీష్‌నాయుడు, రామసుబ్బానాయుడు, జంగందేవర్ల ఏకసిరి అంకయ్య, మహేషలతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. విశ్వనాథరావుపేట రామస్వామిపాలెంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నెల్లూరుకు చెందిన మామిడాల చంద్రశేఖర్, అరుణకుమారి దంపతులు ప్రత్యేక పూజలు జరిపించారు. ముంగమూరులోని పార్వతీ సమేత నీళకంఠేశ్వరస్వామికి సర్పంచు రాయి.వినోద్‌యాదవ్ సుప్రజ దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



చేజర్ల : కోటితీర్థంలో ప్రత్యేక పూజల్లో కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు దంపతులు



చేజర్ల : ప్రత్యేక పూజల్లో మెట్టుకూరు ధనుంజయరెడ్డి దంపతులు

రామస్వామిపాలెం, నాగులవరంలో రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది.

● కందుకూరు : కందుకూరు పట్టణం, పరిసర గ్రామాల్లోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండి కుటుంబసమేతంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని స్కంధపురి సోమేశ్వరాలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్కందపురి సోమేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈవో రవి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. సోమేశ్వరుడు, జనార్ధనస్వామి, అయ్యప్పస్వామి, కోదండరామాలయాలతో పాటు మండలంలోని కొండముడుసుపాలెం, మోపాడు, మాచవరం, ఓగూరు, పలుకూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లోను భక్తులు పెద్దసంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఉలవపాడు : మండలంలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మిన్నంటాయి. దక్షిణ కాశీగా పేరుగడించిన మన్నేటికోట అమరలింగేశ్వర స్వామి ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిక్కిరిసింది. కరేడు గ్రామం బాలకోటయ్య సంఘంలోని శివాలయం, రాజుపాలెం భీమేశ్వరుడి ఆలయం, మన్నేటికోట అమరలింగేశ్వర స్వామి ఆలయంలో కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరమ శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు, ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

● ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి శివరాత్రి జాగరణలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తిరునాళ్లతిప్పలో కాశీనాయన ఆశ్రమంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. పట్టణంలోని శ్రీభూ దేవి శ్రీదేవి సమేత అలఘనాథస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి, అభయాంజనేయస్వామి, శ్రీనివాసేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా ఆలయాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కందుకూరు : సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● దుత్తలూరు (ఉదయగిరి) : దుత్తలూరు సంజీవ శిఖరంపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిలు స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు రామలింగేశ్వరస్వామి క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటుచేసిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానంతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్ర మంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: పట్టణంలోని శ్రీపార్వతీపరమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని గండిపాళెం, లింగాలదొన క్షేత్రం, యర్రబల్లిగడ్డ, గుడినరవ, అప్పసముద్రం, ఆర్లపడియ, జీ.అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఉదయగిరి రూరల్ : గండిపాళెం, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల ఆలయాలలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే వరికుంటపాడు, కాంచెరువు, తోటలచెరువుపల్లిలో శివరాత్రి మహోత్సవాలను నిర్వహించారు.

● సంగం : మండలంలోని సంగమేశ్వరాలయంలో పాతాళ శివలింగానికి, వంగల్లులోని భీమేశ్వరాలయంలో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భీమేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కామాక్షిదేవి మూలవిరాట్‌ను వెన్నతో అలంకరించారు. తిరుమనకొండపై ఉన్న శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో అభిషేకాలు, హోమం తదితర పూజలు నిర్వహించారు. సంగం మెయిన్ బజార్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు జాగరణ చేశారు. గాంధీజనసంఘంలోని చంద్రమౌళేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వంగల్లులో భీమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి భీమేశ్వరస్వామి నందివాహన సేవ వైభవంగా జరిగింది.

● చేజర్ల : స్థానిక, మండలంలోని కాకివాయి హంస రామస్వామి ఆశ్రమం, చిత్తలూరులోని వీరభద్రస్వామి ఆలయం, చేజర్లలోని శివాలయాలలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటితీర్థం గ్రామంలో కామాక్షిదేవి సమేత కోటీశ్వరస్వామి ఆలయాన్ని కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు దంపతులు, మాజీ ఎన్‌డిసిసి బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి దంపతులు, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవచౌదరి దంపతులు, ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ తదితర ప్రముఖులు దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజాము వరకు లింగోద్భవ దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున స్వామి వారికి నందిసేవ వైభవంగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మి పార్థసారథి ఆధ్వర్యంలో పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



దుత్తలూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల ఆశీర్వాదాలు పొందుతున్న ఎమ్మెల్యేలు కాకర్ల, దగుమాటి, మాజీ ఎమ్మెల్యే కంభం

● సీతారామపురం : మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలోని దేవరకొండ లోయలో సిద్దేశ్వరకోనలోని ఇష్టకామేశ్వరి సమేత ఘటిక సిద్దేశ్వరస్వామి, భైరవకోనలోని త్రిముఖ దుర్గాదేవి, సీతారామపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కంటికి జలాభిషేకం, పాలభిషేకం చేశారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఘటిక సిద్దేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం మహాలింగార్చన, రాత్రి లింగోద్భవ సమయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని సిద్దేశ్వరంలోని శ్రీఇష్టకామేశ్వరి సమేత ఘటిక సిద్దేశ్వరస్వామిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వారి కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘటిక సిద్దేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీ హజరత్ సయ్యద్ మహమ్మద్ దర్గాను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, నాయకులు చైతన్య, చెన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, షేక్ బాబు, భోగినేని కాశీరత్తయ్య, ఎడమ ప్రవీణ్, జాషువా, ఇబ్రాయిల్, ఆదినారాయణ, మండల టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఆత్మకూరు శివాలయంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణం



లింగసముద్రం : మొగిలిచెర్లలో దత్తాత్రేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఉదయగిరి రూరల్ పెద్దిరెడ్డిపల్లిలో ఆదిదంపతులకు కల్యాణం



వలేటివారిపాలెం : ప్రత్యేక అలకరణలో భ్రమరాంబికదేవి

మహిళా స్ఫూర్తికి నిదర్శనం దేవిరెడ్డి శారద ట్రస్ట్

● కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దేవిరెడ్డి శారద చారిటుబల్ ట్రస్ట్ ఓ మహిళా స్ఫూర్తికి నిదర్శనమని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. దేవిరెడ్డి శారద 8వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని నార్తుమోపూరు ఇందుపూరు కాలువ సమీపంలోని డీఎస్ఆర్ ట్రస్ట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేవిరెడ్డి శారద విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఏసీఎస్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ నెల్లూరు వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో 75 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్‌వో వీ.సుజాత, అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు కట్టా వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, ట్రస్టీ దశరథరామిరెడ్డి, ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ ఇందుపూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత చౌదరి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బండ్ల రామచంద్రరావు, కొప్పు శ్రీనివాసులు, బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి దేవిరెడ్డి శారద విగ్రహానికి ఘన నివాళులర్పించారు. దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి కుటుంబం గతంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను గురించి ఆయన కొనియాడారు.

తలసీమియా బాధితురాలికి
రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

కావలి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధితో బాధపడుతున్న సైదపేట మునిమోక్షత అనే చిన్నారికి మంజూరైన రూ.10 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరైంది. దీనికి సంబంధించిన పత్రాన్ని బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అందచేశారు. పట్టణంలోని వైకుంఠపురంకు చెందిన మునిమోక్షిత మేజర్ తలసీమియా వ్యాధితో బాధపడుతూ చెన్నై హాస్పటల్‌లో చేరారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స కోసం రూ.25 లక్షలు ఖర్చు అవుతోందని చెప్పారు. దీంతో వారు ఎమ్మెల్యేను ఆశ్రయించగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించి రూ.10 లక్షల మంజూరు చేయించారు.

రేపు మాలకొండలో బహిరంగ వేలం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండలో శుక్రవారం మూడోసారి బహిరంగ వేలం పాటలు జగనున్నాయి. ఆలయ అధికారులు ఈనెల 7వ తేదీన మొదటిసారి బహిరంగ వేలం పాటలు నిర్వహించగా తలనీలాలు వేలం పాట మాత్రమే జరిగింది. మిగిలిన 11 దుకాణాలకు సరైన పాటలు రానందున వాయిదా వేశారు. రెండోసారి ఈనెల 21న వేలం పాటలు పెట్టారు. 11 దుకాణాలకు 3 దుకాణాలకు మాత్రమే పాటదారులు పాడుకున్నారు. దీంతో 8 దుకాణాలకు వేలం వాయిదా వేశారు. వాయిదా పడిన పాటలకు ఈనెల 28వ వేలం పాటలు పెట్టనున్నారు. ఈ సారైనా పాటలకు పాటదారులు డిపాజిట్ చెల్లించి పాడేనా లేక ఈసారి కూడా వాయిదా పడేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందజేస్తున్న కూటమి నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గుమ్మలంపాటి వెంగళరావు తన స్వంత నిధులతో యువకులు, విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. బుధవారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్ మాట్లాడుతూ స్వగ్రామంపై మమకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం గుమ్మలంపాటితో కలిసి పాఠశాల విద్యార్థులతో సహా తోటలచెరువుపల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల యువకులకు క్రికెట్ కిట్లు, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్ బోర్డులు, తదితర క్రీడా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పత్తి జానీ, హజరత్తయ్య, నాగభూషణం, జయరాం, నరసింహారావు, రవి, అవినాష్, ప్రధానోపాధ్యాయులు కేశవమూర్తి, ఉపాధ్యాయులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కావలిరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జువ్విగుంటపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ ఆజ్యం నాగేంద్రబాబు(29) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందగా బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు... ఈ నెల 6వ తేదీన నాగేంద్రబాబు ఫిట్స్‌తో ఇంటి వద్ద పడిపోగా పట్టణంలోని ఓ హాస్పిటల్ కు తీసుకువెళ్లగా రెండు రోజుల పాటు చికిత్స అనంతరం ఇంటికి తీసుకువెళ్లారు. ఇంటి వద్ద పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని మళ్లీ అదే హాస్పిటల్‌కు అక్కడ నుంచి నెల్లూరుకు అక్కడి నుంచి తిరుపతి సిమ్స్‌కు తీసుకువెళ్లగా ఆపరేషన్ అనంతరం ఈనెల 25వ తేది రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య జ్యోష్న ఫిర్యాదుతో ఎస్ఐ బాజిబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాళ్లూరు కుటుంబానికి పలువురి పరామర్శ



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాళ్లూరు వెంకటకృష్ణయ్య నాయుడు చిత్రపటం

దగదర్తి(బిట్రగుంట), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కాట్రాయిపాడుకు చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తాళ్లూరు సుధాకర్‌నాయుడు తండ్రి తాళ్లూరు వెంకటకృష్ణయ్య నాయుడు ఇటీవల మృతి చెందారు. దీంతో టీడీపీకి చెందిన పలువురు నేతలు ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, చవటపుతేడు సర్పంచు పులిశీనయ్య, తిమ్మసముద్రం టీడీపీ నేత మధుసూదనరావు, బోగోలు మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, జిల్లా నేత కోడూరు వెంకటేశ్వరరెడ్డిలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెంకటక్రిష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తాళ్లూరు సుధాకర్‌నాయుడు సతీమణి విజయమ్మ మాజీ సర్పంచు కావడంతో పంచాయతీ వాసులే కాకుండా ఇతర పంచాయతీలకు చెందిన పలువురు నేతలు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

కావలిటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 1913లో ఢిల్లీ సుల్తాన్‌ల హయాంలో వక్ఫ్ బోర్డు ఏర్పడిందని, అనాదిగా వస్తున్న విధానాన్ని కాదని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నూతన విధానాలతో వక్ఫ్ సవరణ చట్టం తెచ్చేందుకు బిల్లును తీసుకురావడం దుర్మార్గమన్నారు. సవరణ బిల్లును వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవోకు, టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు హజరత్, జిలానీని, ఇబ్రహీం, రఫీ, జమీర్, మహబూబ్ బాషా, బుష్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బిట్రగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు గ్రామ సమీపంలో నీరు సరఫరా చేసే ఆటో ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం గౌరవరం గిరిజన కాలనీకి చెందిన యాదగిరి శీను(17) బోగోలు మండలం ముంగమూరులో ఓ రైతు పొలంలో పురుగుల మందు కొట్టి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ముంగమూరు దాటిన తరువాత వాగు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో శీను అక్కడికక్కడే మృతి చెందగా అతనితో వచ్చిన మరో వ్యక్తి యాదగిరి గణేష్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిమెంట్‌రోడ్డు నిర్మాణంపై గ్రామస్థుల హర్షం



నిర్మించిన సిమెంట్‌రోడ్డు

ఉదయగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతోపాటు చిన్నపాటి మరమ్మతులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల నిర్మాణాలు, మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టింది. ఉదయగిరి పట్టణంలోని బాలాజీనగర్‌లో దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన సిమెంట్‌రోడ్డు దెబ్బతినడంతోపాటు వర్షాల సమయంలో రహదారిపై నీరు నిలిచి రోజుల తరబడి ఉండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం 184 మీటర్ల పొడువునా సుమారు రూ.12 లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాదచారులు, వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి
దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.మేకపాడులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యూ.దాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఎస్టీ, ఎస్సీలు అర్హులని తెలిపారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు గురువారం నుంచి మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.



పనులు రూ.కోట్లలో...

- పర్సంటేజీ పెంచిన ఇంజనీరింగ్ అధికారులు
- నాణ్యతను మరిచి, కాంట్రాక్టర్ల వద్ద డిమాండ్
- కార్పొరేషన్‌లో పెరిగిన అవినీతి

కమీషన్లు లక్షల్లో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ శాఖల్లో అవినీతిని తగ్గిస్తూ.. జవాబుదారీతనాన్ని పెంచుతూ వస్తున్నది... కానీ నెల్లూరు నగర పాలక సంస్థలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇంజనీరింగ్ అధికారులు 8 శాతం కమీషన్లు వసూలు చేస్తుండగా, కూటమి సర్కారులో దాన్ని 10 శాతానికి పెంచారు. సీసీరోడ్లు, డ్రైన్లు, ఇతర నిర్మాణాలు శరవేగంగా జరుగుతుండటంతో నాణ్యతకు తిలోదకాలిచ్చిన ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ల నుంచి వద్ద ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం రూ.కోట్ల పనులు జరుగుతుండటంతో రూ. లక్షల అవినీతి సొమ్ము వారి జేబుల్లోకి వెళ్తోంది.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

నెల్లూరులో అటు సిటీ, ఇటు రూరల్ నియోజకవర్గాల పరిధిలో వివిధ గ్రాంట్ల కింద అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. గత ప్రభుత్వంలో పంపిన ప్రతిపాదనలతో పాటు కొత్త అంచనాలు కలుపుకుని డివిజన్లలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, కల్వర్టులు, షెల్టర్లు, వ్యాపార సముదాయాల నిర్మాణం, పార్కుల సుందరీకరణ, డివైడర్ల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరికొన్ని నిర్మాణాలను కూడా నగరాన్నే ప్రయోగాత్మకంగా తీసుకుని చేపడుతున్నారు. నిధులకు లోటు రానివ్వకుండా మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని మంజూరు చేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు ఇంజనీరింగ్ అధికారులు పర్సెంటేజీలు పెంచేసి ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నారు. నాణ్యతను ఏ మాత్రం పట్టించుకోనివారు తమ సొమ్ము తమకు అందచేస్తేచాలంటూ కాంట్రాక్టర్లకు తెగేసి చెప్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో అధికారులు కోరిన మేరకు కాంట్రాక్టర్లు కమీషన్లు ముట్టచెప్తున్నారు.

● పట్టించుకునేవారేరీ ?

కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతికి అంతేలేదు. ఇక్కడ జవాబుదారీతనం పూర్తిగా పక్కదారి పట్టింది. ఇంజనీరింగ్ విభాగంతోపాటు, రెవెన్యూ, ఆరోగ్యం విభాగాల్లోనూ అవినీతి తారస్థాయికి చేరింది. పురపాలకశాఖకు నేతృత్వం వహిస్తున్న మంత్రి స్వయంగా ఇక్కడ నుంచే ప్రాతినిధ్యం ఉన్నా, భయం కూడా లేకుండా ఎన్‌ఎంసీ అధికారులు బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఫైసలు ఇవ్వందే పత్రం ముట్టని తీరుకు ఇక్కడ అధికార యంత్రాంగం చేరుకుంది. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా చోద్యం చూస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పెరిగిన అవినీతి

జగన్ అధికారంలో ఉన్నప్పుడు రూ. లక్షకు 8 శాతం కమీషన్ వసూళ్లు చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు, తాజాగా 10 శాతానికి పెంచారంటూ కాంట్రాక్టర్లు లబోదిబోమం టున్నారు. క్షేత్రస్థాయిలో ఏఈలు 2 శాతం, డీఈలు మరో 2 శాతం, ఈఈలు 1శాతం నుంచి 1.5 శాతం చొప్పున కమీషన్లు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇకపోతే క్వాలిటీ కంట్రోల్ విభాగానికి 1.5, అకౌంట్స్ 0.5, బిల్లుల పరిశీలనకు 0.5, ఎంబుక్కులు తయారీ, అంచనాల దస్త్రం తయారీకి కలిపి ఒకశాతం చొప్పున కమీషన్లు ఇవ్వాల్సి వస్తున్నదని కొందరు కాంట్రాక్టర్లు తెలిపారు. ఇవికాక వర్కు‌ఇన్‌స్పెక్టర్లకు రోజువారీ వేతనంగా రూ. 1000లు, నాణ్యత పరిశీలనలో తీసే కోర్ (ల్యాబ్‌కు పంపే నమూనా)కు రూ. 800 చొప్పున ఇస్తున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కార్యాలయం, పేషీ ఖర్చులు అదనంగా ఉంటాయని వారు పేర్కొన్నారు.



ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న చైర్‌పర్సన్

విద్యార్థుల వెట్టిచాకిరీపై

వివరణ ఇవ్వండి

ఉదయగిరి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో విద్యార్థుల చేత వెట్టిచాకిరీ చేయించిన ఘటనపై జిల్లా యంత్రాంగం మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు, సభ్యురాలు పద్మావతిలు బుధవారం సూచించారు. ఈఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమకు ఫిర్యాదు చేశారన్నారు. గురుకుల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థుల చేత చపాతీలు చేయించినా, గదులు శుభ్రం చేయించినా, నీళ్లు పట్టించినా శాఖ, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై జిల్లా బాలల సంక్షేమ కమిటీ, గురుకుల పాఠశాల ఉన్నతాధికారులు విచారణ చేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని వారు సూచించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశాల మేరకు మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలను బుధవారం బాలల సంక్షేమ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ మాధవి, సభ్యుడు శ్రీనివాసరావులు బుధవారం తనిఖీ చేశారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థుల చేత చపాతీలు చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో వారు పాఠశాలలో వంటశాల, వసతిగృహాన్ని తనిఖీ చేయడంతోపాటు ప్రిన్సిపాల్ పుష్పరాజ్, ఉపాధ్యాయులు, వంట మనుషులు, విద్యార్థులను ప్రత్యేకంగా విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, సీఆర్‌ఎంటీ భోగ్యం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

ఉదయగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తన భార్య పువ్వాడి ధనలక్ష్మి కనిపించడంలేదని ఉదయగిరి పట్టణానికి చెందిన ఆమె భర్త వెంకట్రాది బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఓ కార్యక్రమానికి వెళ్లి ఇంటికి వచ్చారని, ఆ విషయంపై ఇంట్లో వివాదం చోటు చేసుకోవడంతో అప్పటి నుంచి ఆమె కనిపించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఆమె సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉందని, బంధువులను కూడా విచారించామని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వడ్డిపాలెంలో పూరిల్లు దగ్ధం

కావలి, రూరల్ : కావలి పట్టణం వడ్డిపాలెంలో బుధవారం గుంజి కోటేశ్వరికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. బాధితురాలు కోటేశ్వరి ఇంట్లో దేవుడి పటాల వద్ద దీపారాధన చేసిన అనంతరం కొంత సేపటి తరువాత ఇంటి తలుపులు వేసి బయటకు వెళ్లింది. కొంత సేపటి తరువాత ఇంటి నుండి పొగతోపాటు మంటలు వ్యాపించాయి. ఆ మంటలు ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌కు అంటుకోవటంతో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురై అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రామసిద్దార్థ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్‌తో పాటు డాక్యుమెంట్లు, ఇంట్లో సామగ్రి, కొంత నగదు కాలి బూడిదైంది.

రైతన్నకు వినిపించని

'పొలం పిలుస్తోంది'!

తూతూమంత్రంగా అవగాహన సదస్సులు ● కనిపించని అనుబంధ శాఖల అధికారులు



సాగులో ఉన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)

ఉదయగిరి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజుగా చూడాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం క్షేత్రస్థాయిలో మొక్కుబడిగా సాగుతోంది. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మార్కెటింగ్, జలవనరుల శాఖ అధికారులతో పాటు రైతుమిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ సిబ్బంది హాజరై పంటల సాగులో, పంటలకు సోకే చీడపీడల నివారణకు అవసరమైన సలహాలు, సూచనలు అన్నదాతలకు ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగా కనీస కార్యాచరణ ఉండటం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు మినహా మిగలిన ఏ ఒక్క శాఖాధికారి అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి.

● సమాచారమేదీ..!?

ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాలు చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించాలి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెప్టెంబరు 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించారు. రబీ సీజన్ కావడంతో ప్రస్తుతం అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామంలో సదస్సులకు వ్యవసాయ అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో రైతులకు సమాచారం కూడా లేదు. దీంతో వారంతా పనులకు వెళ్లిపోతున్నారు. గ్రామాల్లో రచ్చబండలపైన అరకొరగా ఉన్న రైతులకు తూతూమంత్రంగా అవగాహన కల్పించి నామమాత్రంగా పంటలను పరిశీలిస్తున్నారు. రబీ సీజన్‌లో జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల్లో వరి, మినుము, శనగ, పొగాకు, మొక్కజొన్న, వేరుశనగ, పసుపు తదితర పంటలను రైతులు సాగు చేశారు.

● లక్ష్యానికి దూరంగా...

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగు ఖర్చులు తగ్గించుకోవడం, దిగుబడుల పెంపు, తెగుళ్ల నివారణ తదితర వాటిపై సూచనలు చేయాలి. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు ఉండేలా ప్రత్యామ్నాయ పంటలు సాగును ప్రోత్సహించాలి. కౌలు రైతుల విషయంలో మరింత శ్రద్ధ వహించాలి. ఇవేవీ సదస్సులో కనిపించడంలేదు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోకజవర్గంలో ఉద్యాన పంటలైన బత్తాయి, మామిడి, బొప్పాయి, వాణిజ్య పంట అయిన పసుపు అధికంగా సాగు చేస్తారు. ఆయా పంటలకు తెగుళ్ల విజృంభణ అధికంగా ఉంది. కొంతమంది రైతులకు వాటి నివారణకు ఏ మందులు వాడాలి.. ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో అర్థంకాక ఎరువుల దుకాణాల యజమానులను ఆశ్రయించి వారు చెప్పిందే వేదంగా మందులు పిచికారీ చేస్తూ నష్టపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కార్యక్రమానికి అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపట్టి రైతును కాపాడాలని పలువురు కోరుతున్నారు.

సమాచారం అందిస్తున్నాం

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొనాలని అనుబంధ శాఖల అధికారులకు ప్రతిసారీ చెబుతున్నాం. కార్యక్రమం ప్రారంభంలో కొన్నిరోజులు హాజరయ్యారు. అనంతరం తమ కార్యాలయంలో పనులు ఉన్నాయని చెబుతూ హాజరు కావడంలేదు.

- పీ.చెన్నారెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, ఉదయగిరి

బ్యాంకు ఖాతాలో నగదు మాయం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు కోసం వివరాలు నమోదు చేయగా, అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.3.17 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు దోచేశారు. ఈ ఘటనపై నగరంలోని దర్గామిట్ట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆల్బర్ట్ డేవిడ్‌పీటర్ ముత్తుకూరులోని ఓ పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తూ, నెల్లూరు ఇస్కాన్‌సిటీలోని ఓ అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో ఉంటున్నాడు. కొన్ని నెలల కిందట క్రెడిట్ కార్డు కోసం ఆయన ఓ జాతీయ బ్యాంకుకు చెందిన వెబ్‌సైట్ తెరిచి వివరాలు నమోదు చేశాడు. పాత క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేయగానే, అతడి బ్యాంకు ఖాతా నుంచి పలు దఫాలుగా రూ.3,17,438 నగదు డ్రా అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్‌పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం దర్గామిట్ట పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ జీవీ. సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి నీళ్లలో పడి గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నగరంలోని పెన్నా బ్రిడ్జి కింద బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు, గుర్తు తెలియని యువకుడు (30) గుర్తుతెలియని రైలు నుంచి జారి పెన్నాలో పడి నీట మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ జీ. మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు క్రీమ్ కలర్ ఫుల్ హ్యాండ్ టీ షర్ట్, నలుపు రంగు నైట్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి, తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతిపై కేర్‌టేకర్ దౌర్జన్యం

ఏఎస్ పేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వారి ఆలనా పాలన చూసుకునే కేర్ టేకర్ ఓ యువతిపై దౌర్జన్యం చేసిన సంఘటన బుధవారం ఏఎస్ పేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నిజామాబాద్‌కు చెందిన ఓ యువతి తన తమ్ముడికి మతిస్థిమితం లేకపోవడంతో ఏఎస్ పేట దర్గాకు తీసుకునివచ్చి అక్కడే ఉంటున్నారు. కాగా, మతిస్థిమితం లేని వారిని చూసుకుంటూ వారి కుటుంబ సభ్యుల నుంచి నగదు తీసుకుంటూ కేర్ టేకర్‌గా ఉంటున్న షరీఫ్ యువతి తమ్ముడిని తన వద్ద ఉంచాలని ఆమెను కోరాడు. దానికి ఆమె అంగీకరించలేదు. అయినా షరీఫ్ దౌర్జన్యంగా ఆమె తమ్ముడిని తీసుకెళ్లాడు. ఈవిషయం తెలిసి యువతి వెళ్లి ప్రశ్నించగా మతిస్థిమితం లేని వారు బయట ఎక్కడా ఉండకూడదు.. నగదు చెల్లించి తన వద్దే ఉంచాలని దురుసుగా మాట్లాడుతూ దాడిచేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి



యశ్వంత్ (ఫైల్)

సంగం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన సంఘటన బుధవారం కోలగట్లలో జరిగింది. వివరాల మేరకు.. ఆత్మకూరుకు చెందిన గంగాధర్, ప్రసన్న దంపతుల కుమారుడు యశ్వంత్ (15) ఆత్మకూరు ప్రగతి స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా పాఠశాలకు శెలవు కావడంతో మధ్యాహ్నం భోజనం చేసి తోటి స్నేహితులతో కలిసి కోలగట్లలోని నాగారపమ్మ ఆలయానికి సమీపంలో పెన్నానదిలో సరదాగా ఈతకు దిగాడు. యశ్వంత్ నీటిలోకి లోతుగా వెళ్లి ఈత సరిగా రాకపోవడంతో గల్లంతయ్యాడు. మిగిలిన విద్యార్థులు కేకలు వేయడంతో ఆలయం వద్ద ఉన్న స్థానికులు సంగం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలించగా యశ్వంత్ ఆచూకీ లభ్యమవడంతో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న విద్యార్థి తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టైలర్స్ ఫెడరేషన్‌ను పునరుద్ధరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా టైలర్స్ వర్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టైలర్ల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం టైలర్స్ ఫెడరేషన్‌ను పునరుద్ధరించాలని జిల్లా టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి యానాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టైలరింగ్ వృత్తిలో కొనసాగాలంటే తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నా మన్నారు. రెడీమేడ్ దుస్తులు, టైలరింగ్ ముడిసరుకుల ధరల విపరీతంగా పెరగడంతో టైలరింగ్ వృత్తి కష్టాలపాల వుతున్నదని పేర్కొ న్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని టైలర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. టైలరింగ్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. దృష్టి లోపం ఉన్న టైలర్లకు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి వృత్తి నైపుణ్యం, శిక్షణ, అసోసియేషన్ కార్యాలయం కోసం ప్రభుత్వం స్థలం కేటాయిం చాలని కోరారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులు 500 మందికి ఒక్కొక్కరికి రూ.50వేలు విలువ చేసే సామగ్రిని అందజేశామన్నారు. శుక్రవారం టైలర్స్‌డేను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆరోజు ఉదయం 10గంటలకు ట్రంకురోడ్డు నుంచి మినీ బైపాస్‌లోని ఓ కల్యాణ మండపం వరకు ర్యాలీగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ.మురళీకృష్ణ, జిల్లా కోశాధికారి షేక్.బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు వీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ హనీఫ్

పొదలకూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని సంగం బ్యారేజ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతిచెం దాడు. మృతదేహం నీటిలో తేలియాడుతుండడంతో స్థానికులు గుర్తించి పొదలకూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంగం బ్యారే జ్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎండీ.హనీఫ్ పాల్గొన్నారు.

రేపు జాతీయ సైన్స్ దినోత్సవం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'అభివృద్ధి చెందిన భారతదేశం కోసం సైన్స్ ఆవిష్కరణలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారిత కల్పించడం' అనే థీమ్‌తో ప్రాథమిక, సెకండరీ విభాగాల్లో విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందచేస్తామన్నారు. జిల్లాలోని అన్నీ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని కోరారు.


● ఓపెన్ ఇంటర్ హాల్‌టికెట్ల విడుదల

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి 15 వరకు జరిగే ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్‌లను విడుదల చేసినట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యాసకులు తమ హాల్‌టికెట్లను సంబంధిత స్టడీ సెంటర్‌లోనూ లేదా www.apopen school.ap.gov.in అనే వెబ్‌సైట్ నుంచి కానీ పొందవచ్చని తెలిపారు.

ఊరంతా రీసర్వే అలజడి

- నాటి జగన్ సర్కారు పాపం
- అసైన్డ్ భూములన్నీ ప్రభుత్వానివిగా నమోదు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

కలువాయి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఒకరు.. ఇద్దరు కాదు వందల మంది పేదలు సుమారు 40 ఏళ్ల నుంచి ప్రభుత్వం అసైన్ చేసిన భూముల్లో సాగు చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ పథకాల ద్వారా బోర్లు, బావులు తవ్వుకుని పైర్లు పెట్టుకుంటున్నారు. మామిడి, నిమ్మ, వరి వంటి పంటలు పండించుకుంటున్నారు. వారి పట్టాదారు పాస్ పుస్తకాలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి పంట రుణాలు తీసుకుంటున్నారు. అయితే జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూముల రీసర్వే వారిని నిండా ముంచింది. ఇన్నాళ్లు సాగు చేసుకుంటున్న భూముల కేటాయింపు చెల్లదని అవి ప్రభుత్వ భూములుగా రీ సర్వేలో అధికారులు నమోదు చేశారు. ఈ అన్యాయం ఎక్కడైనా ఉందా!? అంటూ పేద రైతులు లబోదిబోమంటున్నారు. ఇది కలువాయి మండలం మాదన్నగారిపల్లె రెవెన్యూ పరిధిలో చోటుచేసుకుంది. సుమారు 40 ఏళ్ల క్రితం రామన్నగారిపల్లె, మాదన్నగారిపల్లె గ్రామాల్లో 300 మంది రైతులకుపైగా సుమారు 400 ఎకరాలు ప్రభుత్వం అసైన్ చేసింది. రీ సర్వేలో ఈ భూముల కేటాయింపు చెల్లదంటూ పిడుగు లాంటి వార్త సర్వే సిబ్బంది రైతుల చెవిలో వేశారు. అప్పటినుంచి వారి బాధ వర్ణాతీతంగా ఉంది. రీ సర్వేలో వారి భూములను ప్రభుత్వ భూములుగా నమోదు చేయడంతో అప్పటివరకు వారికి బ్యాంక్‌లు ఇస్తున్న పంట రుణాలు నిలిచిపోయాయి. చెట్లు, చేమ పెంచుకుని పెద్ద చేసుకున్న తరువాత ఇప్పుడు తమకు ఇచ్చిన పట్టాలు చెల్లవని చెప్పడం ఏమిటని వారు ప్రశ్నిస్తు న్నారు. ఈ విషయం ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోని తీసుకురావడంతో ఈ భూములపై ఉన్నతాధికారులు విచారణ చేయిస్తున్నారు. న్యాయం చేయాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు.



రామన్నగారిపల్లెలో పేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూముల్లో ఉన్న నిమ్మ చెట్లు


పాస్ పుస్తకాలు ఇచ్చారు



ప్రభుత్వం మాకు ఇచ్చిన అసైన్‌మెంటు భూము లకు పట్టాదారు పాస్‌పుస్త కాలు కూడా మంజూరు చేసింది. బోర్లు, బావులు, కరెంటు కనెక్షన్లు తీసుకుని నిమ్మతోటలు సాగు చేసుకున్నాం. రీ సర్వే కోసం వచ్చి మా భూములు ప్రభుత్వ భూములుగా నమోదు చేశారు. మాకు ఈ భూమే ఆధారం.

- బొజ్జా నరసయ్య, రామన్నగారిపల్లె

బ్యాంక్‌లో రుణం ఇవ్వడం లేదు!



నాకు ప్రభుత్వం ఇచ్చిన భూమి పాస్‌పుస్తకం బ్యాంక్‌లో పెట్టి పంట రుణం తీసుకుంటూ ఉంటాను. ఈమధ్య నేను పంట రుణం రెన్యూవల్ కోసం బ్యాంకుకు వెళితే ఇక భూములకు రుణం ఇవ్వమని చెప్పారు. మా భూములు ప్రభుత్వ భూములుగా రీ సర్వే వారు నమోదు చేశారట.

- బొజ్జా పెంచల నరసయ్య, రామన్నగారిపల్లె

కమనీయం సంగమేశ్వరుడి కల్యాణం

• పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మనుబోలులోని శ్రీ కామాక్షితాయి, సంగమేశ్వరుని కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణంకు ఉభయదాతలుగా పచ్చిపాల శ్రీనువాసులు రెడ్డి, శ్రీకళ, వేమూరు శ్రీనువాసులురెడ్డి, సుజన, పూండ్ల అనీష్ రెడ్డి, ఉద్దీప దంపతులు వ్యవహరించారు. స్వామి కల్యాణంలో ఓజంట వివాహం చేసుకుంది. భక్తులకు భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఆలయ అన్నదాన కమిటీ ఏర్పాటు చేసింది. అలాగే మండలంలోని మనుబోలు, బద్దెవోలు, కొలనుకుదురు, పిడూరుపాళెం, మడమనూరు, పిడూరు శివాలయాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. సాయంత్రం సంగమేశ్వరుని దేవస్థానం నుంచి మనుబోలు వరకు ఆదిదంపతుల పల్లకీసేవ వైభవంగా సాగింది. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, గాలి రామకృష్ణారెడ్డి, పచ్చిపాల రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: అడవిలోని శివాలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పాలభిషేకం



మనుబోలులో ఆదిదంపతుల కల్యాణం



విడవలూరు : భక్తులతో కిటకిటలాడిన రామలింగేశ్వరస్వామి ఆలయం



స్వర్ణలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి దంపతులు



ప్రత్యేక అలంకరణలో గాంధీనగర్ కృష్ణమందిరంలోని భవానీ శంకరుడు

వాడవాడలా వైభవంగా శివరాత్రి వేడుకలు

నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు, ఇతర ఆలయాల్లో బుధవారం శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు ఉపవాసం ఉండి, స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రికి జాగారం చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నగరోత్సవం జరిపారు. లింగోద్భవ సమయంలో స్వామివారిని వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు. ఆ వివరాలు...

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లాకి చెందిన పలువురు ప్రముఖులు వివిధ ఆలయాల్లో తమ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి-విజితమ్మ దంపతులు నగరంలోని గణేష్‌ఘాట్ వద్ద గల స్వర్ణలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. బీజేపీ నాయకుడు పీ.సురేంద్రరెడ్డి కూడా ప్రత్యేక పూజలు చేశారు. హరనాథ పురంలోని బ్రహ్మేశ్వరాలయంలో టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి-ఉషాకిరణ్ దంపతులు, వారి కుమారుడు వెంకటసు మంత్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం బిల్వార్చనతోపాటు కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయం లో పూజలు నిర్వహించి, మహిళలకు పసుపు కుంకుమ, జాకెట్లు, గాజులు, పసుపుదారాలు అందచేశారు.

● రాజరాజేశ్వరి ఆలయంలో ఉన్న శ్రీసుందరేశ్వరస్వామి ఆలయం లో బుధవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. అనంతరం స్వామివారికి గిన్నె బిక్ష ఉత్సవం జరిగింది. సాయంత్రం పూలంగి సేవ, వేద పారాయణం, నాదస్వర కచేరీ, లింగోద్భవం కనుల పండువగా జరిగాయి. రాత్రి, మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామికి నందివాహనంపై నగరోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలు గా ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు పర్యవేక్షించారు.



ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత విశ్వనాథ ఆలయంలో అభిషేక పూజలు తిలకిస్తున్న ఆడిటర్ రఘు, నగర ప్రముఖులు

● విరాట్‌నగర్‌లోని గాయత్రీ విశ్వకర్మభగవాన్, గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, కలిశతీర్థం, అభిషేకాలు, పూలం గిసేవ,వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం కనుల పండువగా జరిగాయి. కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

● మూలాపేట అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, గిన్నె బిక్ష, లింగోద్భవ అభిషేకాలు, నందివాహన సేవ కన్నుల పండువగా జరిగాయి.

● సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలోని ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామిలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ఏకరుద్ర అభిషేకం, ప్రదోషకాలంలో నందిపూజ, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ అజయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

● మూలాపేట గణేష్‌ఘాట్ స్వర్ణలిం గేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతా భిషేకంతోపాటు 108 లీటర్ల చెరుకు రసం తో జరిగింది. రుద్రహోమాలు, విశేష అర్చనలు, పూలంగిసేవ జరిగింది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు పాల్గొని మహారుద్రాభిషేకం చేశారు. రాత్రి లింగోద్భవ అభిషేకాన్ని భక్తులు తిలకించారు. కార్యక్రమాలను విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభి షేకం, రుద్రహోమం జరిగాయి. అనంత రం గిన్నెబిక్ష ఉత్సవం పూజలు, విశేష పుష్పాలంకారం జరిగింది. రాత్రి లింగో ద్భవ అభిషేకం, నందివాహన సేవ జరిగాయి. ఈ ఉత్సవాల్లో ఆడిటర్ రఘు, జయరామయ్యనాయుడు, కామేశ్వరరావు, పెసల సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు. ఈవో దర్గయ్య ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

● నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, హోమం, గిన్నెబిక్ష ఉత్సవాలు జరిగాయి. రాత్రి లింగోద్భవ అభిషేకాలు, అనంతరం నందిసేవ, నగరోత్సవం జరిగింది. కార్యక్రమాలను ఈవో కవిత, అర్చకులు పర్యవేక్షించారు.

● శోధన్‌నగర్‌లోని వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మహాశివుడికి ఘనంగా పాలభిషేకాలు, పుష్పాభిషేకాలు జరిగాయి. సాయంత్రం కుంభమేళా నుంచి తెచ్చిన గంగా జలాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్ర మాలను డాడీ యూత్ ఫౌండేషన్ నిర్వాహకులు ఆనందరావు, మిత్ర మండలి సభ్యులు పర్యవేక్షించారు.

● గాంధీనగర్ కృష్ణమందిరంలోని భవానీ శంకరస్వామికి పాలభిషేకం, భజనలు, రాత్రి లింగోద్భవ అభిషే కాలు జరిగాయి. ఈ కార్య క్రమాలను ఉభయకర్తలు, ధర్మకర్తలు, అర్చకులు శ్రీనివాస స్వామి పర్యవేక్షించారు. అలాగే నగరంలోని పెన్నాతీరం, భక్తవత్సల నగర్, షిరిడీ సాయి మంది రాల్లో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి.



హరనాథపురం బ్రహ్మేశ్వరాలయంలో పూజలు చేస్తున్న వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

● పొదలకూరు : స్థానిక చోళుల కాలం నాటి శ్రీకామాక్షితాయి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. పట్టణంలోని పురాతన శివాలయంతో పాటు దేగపూడి, చెన్నా రెడ్డిపల్లి, విరువూరు, బిరదవోలు, అయ్యగారి పాలెం, మొగ ళ్లూరు, శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. శుక్ర వారం రాత్రి 12గంటలకు లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రా భిషేకం నిర్వ హించారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసు కోకుండా సీఐ శివరామ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ షేక్. హనీఫ్, సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేప ట్టారు. మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● తోటపల్లి గూడూరు : మండలంలోని కాటేపల్లి, కోడూరు, తోటపల్లి గూడూరులో వున్న శివాలయాలకు భక్తులు బుధవారం పోటెత్తారు. కాటేపల్లి శివాలయం శివనామ స్మరణతో మార్మోగింది. భక్తులకు మాజీ సర్పంచు కె సుబ్బారావు అన్నదాన చేశారు. సీఐ రవినాయక్, ఎస్‌ఐ వీరేంద్రబాబు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

● జనసంద్రమైన మైపాడు తీరం

ఇందుకూరుపేట : మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని మైపాడు సముద్రతీరం జనసంద్రమైంది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సముద్ర స్నానమాచరించి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సముద్రం ఒడ్డున ఉన్న శివాలయంలో శివపార్వ తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఎస్‌ఐ నాగా ర్జునరెడ్డి తమ సిబ్బంది తో గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

పొదలకూరు: దర్శనం కోసం బారులు తీరిన భక్తులు







రాపూరు: బుగ్గేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరి

● రాపూరు : మండలంలోని బుగ్గే శ్వరకోన, సిద్ధలేశ్వరకోన, మామిడి కోన శివనామ స్మరణతో మారుమోగాయి. అకిలవలనలోని బుగ్గేశ్వరస్వామి ఆల యంలో తెల్లవారుజామున పంచామృత అభిషేకంతో మొదలై సామూ హిక కుంకుమార్చన, మహాపూర్ణాహుతి కార్యక్రమం, శివపా ర్వతుల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. రాత్రి లింగో దర్భవ అభిషేకం వైభవంగా నిర్వహించారు. జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డి దంపతులు, పెంచలకోన మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పట్టణంలోని పురా తన శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సిద్దలేశ్వరకోన, మామి డికోనలో భక్తులు కోలాహలం నెలకొంది.

ఘనంగా జెండా ఉత్సవం

మహా శివరాత్రి సందర్భంగా రాపూరు పట్టణంలోని పడమటి వీధి వద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద జెండా ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కుమ్మరివీధి, కాపువీధి, శివాలయం వీధి, కొత్తపేట, హరిజనవాడ గుండా జెండా ఊరేగింపు అట్టహాసంగా సాగింది. సాంప్రదాయ పద్ధతిలో ఎడ్లబండిపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. పట్టణవాసులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి, కాకుటూరు, అడవిలోని శివాలయం, కను పూరు, కసుమూరు, ఎగువమిట్ట, పూడిపర్తి తదితర గ్రామాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అడవిలోని శివాలయంలో సోమిరెడ్డి పూజలు

అడవిలోని శివాలయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, పలువురు కూటమి నేతలున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి వేడుకలు వైభవంగా బుధవారం జరిగాయి. బుచ్చిలోని శివాలయం, బాబామందిరం, జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయం, దామరమడుగు తదితర గ్రామాల్లో శైవాలయాలు శివనామస్మరణలతో మార్మోగాయి. జొన్నవాడ ఆలయంలో ఉదయం నుంచి రాత్రి లింగోద్భావకాల పూజలు పూర్తయ్యేవరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు పెన్నానదిలో స్నానాలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు వెండి రథోత్సవం జరిగింది. రాత్రి పెద్ద వెండి నందివాహన సేవలో స్వామి, అమ్మవార్లు దర్శనమిచ్చారు. కనిగిరి రిజర్వాయర్‌లో శివలింగానికి పంచామృత అభిషేకం, దుర్గామల్లేశ్వర ఆలయంలో అభిషేకం నిర్వహించారు. కాగా, జొన్నవాడ ఆలయంలో అగిన పురాతన ఆచార సాంప్రదాయమైన కశ్యపతీర్థం రేవు నుంచి తెచ్చే వెండి బిందె తీర్థం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో పునరుద్ధరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

జొన్నవాడకు పోటెత్తిన భక్తులు

● పోటాపోటీగా బండలాగుడు పందేలు

మహాశివరాత్రిని పురస్కరించకుని జొన్నవాడలో జిల్లాస్థాయి ఎడ్ల బండలాగుడు పందేలు పోటాపోటీగా జరిగాయి. ఈ పోటీలలో 13 జతల ఎడ్లు పాల్గొన్నాయి. జొన్నవాడకు చెందిన మద్దిశెట్టి అంకయ్య ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిశాయి. మొదటి బహుమతి రూ.25వేలను సర్పంచు కందికట్టు పెంచలయ్య, ముంగర సుధాకర్ దాతలుగా అందజేశారు. 2వ బహుమతిని లక్ష్మి, వెంకటరత్నం, శివరామయ్య, చిన్నసుబ్బయ్య, 3వ బహుమతిని వుమ్మయ్యస్వామి, 4వ బహుమతిని శివయ్య, 5వ బహుమతిని చిన్నబ్బయ్య సోదరులు అందజేశారు.

● రామతీర్థంలో...

విడవలూరు : రామతీర్థంలో కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జాగరణ చేసి సముద్ర స్నానాలు అచరించారు. కోవూరు కోర్టు న్యాయాధికారి శివంనమ్రత తీరంలో సైకత శివలింగానికి పూజలు నిర్వహించి, స్వామి, అమ్మవార్లని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లకు నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. వేలాదిగా విచ్చేసిన భక్తులకు వీపీఆర్ ట్రస్టు ద్వారా టీడీపీ నాయకులు తాతా రమేష్, ఉప్పాల వెంకటరమణయ్య, నడవడి మస్తాన్, నాటారు విజకుమార్‌లు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లని అందజేశారు. ఆలయ ఈవో రామకృష్ణ, గుమస్తా వెంకటేశ్వర్లు ఏర్పాట్లు చేశారు.



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

● శివనామస్మరణతో...

కొడవలూరు : కొడవలూరు, గండవరం గ్రామాల్లో గంగా సమేత ఉదయకాళేశ్వరస్వామి, నాగేశ్వరస్వామి ఆలయాలు బుధవారం శివనామస్మరణలతో మారుమోగాయి. జిల్లా ముఖ్య అధికారులు ఎస్పీ కృష్ణకాంత్, నాయకులు పొరసరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

'ప్రియదర్శిని'లో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నగరం సమీపంలోని కనుపర్తిపాడులోగల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులకు హాస్టల్ వసతులు సరిగా లేకపోవడం, ఫీజులు చెల్లించినా హాల్‌టికెట్లు ఇవ్వక పోవడం వంటి సమస్యలపై వారు చేపట్టిన ఆందోళనకు తాము పూర్తిగా మద్దతు ఇచ్చామన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యధోరణితో విసిగిపోయిన విద్యార్థులు చివరకు తిరగబడే పరిస్థితికి రావడం బాధాకరమన్నారు. విద్యార్థుల అవసరాలు, హక్కులను పరిగణలోకి తీసుకోకుండా కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించుకుంటే తాము పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందేలు



వీరారెడ్డిపాళెంలో జరుగుతున్న ఎడ్ల పరుగు పందెం

విడవలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వరిణి పంచాయతీ వీరారెడ్డిపాళెంలో మండల స్థాయి ఎడ్ల పరుగు పందేలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 6 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఎంతో ఆసక్తికరంగా జరిగిన ఈ పరుగు పందేల్లో మొదటి స్థానంలో కోటేశ్వరరావు ఎడ్లు, ద్వితీయ స్థానంలో కోడి పోలయ్య, తృతీయ స్థానంలో మద్దూలూరు లలితకుమార్, నాల్గవ స్థానంలో కోడూరు బాబులు ఎడ్లు నిలిశాయి. విజేతలకు తానంగారి గోవిందు, తోళ్ల శ్రీనివాసులు, కొండా రఘు, భక్తాని లక్ష్మీనారాయణలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తూళ్లూరు మాధవ్, తిరపతయ్య, మద్దులూరు రాజన్న గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రప్రభ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా బుధవారం కల్యాణ వేంకటేశ్వరుడు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తుమ్మల పెంచలరెడ్డి, తోట శ్రీనివాసులురెడ్డి వ్యవహరించారు. ఉదయం ఆలయంలో సుదర్శన నారసింహయాగం వైభవంగా జరిగింది.

రేపు మాలకొండలో వేలం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండలో శుక్రవారం మూడోసారి వేలం పాటలు జగనున్నాయి. ఆలయ అధికారులు ఈనెల 7న మొదటిసారి వేలం పాటలు నిర్వహించగా తలనీలాలు వేలం మాత్రమే జరిగింది. మిగిలిన 11 దుకాణాలకు సరైన పాటలు రానందున వాయిదా వేశారు. రెండోసారి ఈనెల 21న వేలం వేశారు. 11 దుకాణాల్లో మూడింటికి మాత్రమే వేలం పాడుకున్నారు. దీంతో 8 దుకాణాలకు వేలం వాయిదా వేశారు. వాయిదా పడిన వేలం పాటలను శుక్రవారం నిర్వహించనున్నారు.

నాలుగేళ్లుగా తొలగని ఆక్రమణలు

● వైద్యఆరోగ్యశాఖ స్థలంలో దుకాణాలు నిర్మించి వ్యాపారాలు ● ప్రశ్నించిన వైద్యాధికారులపై దౌర్జన్యం

● పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ్ దృష్టికి వైద్యఆరోగ్యశాఖ స్థలాల ఆక్రమణల విషయాన్ని అధికారులు తీసుకెళ్లారు. అయినా ఆ ఆక్రమణలు మాత్రం యథాతథంగా ఉన్నాయి. వైసీపీ నేతలు ఆక్రమణలకు పాల్పడి ఏకంగా షాపులు కట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. నాలుగేళ్లుగా ఇవి కొనసాగుతున్నాయి. కొందరైతే ఏకంగా ఆ షాపులను కూడా అద్దెకు ఇచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత జరిగినా అటు మంత్రికానీ, ఇటు అధికారులుకానీ పట్టించుకోక పోవటం విమర్శలకు దారితీస్తుంది. నగరంలోని గోషా ఆసుపత్రి పక్కనే వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని మలేరియా విభాగానికి చెందిన కార్యాలయం ఉంది. అయితే జగన్ పాలనలో ఆ శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయించి, ఓ వైసీపీ నాయకుడి కుటుంబం ఆక్రమించింది. ఈ ఆక్రమణలపై ఆంధ్రజ్యోతి కథనం రాయటంతో ఆక్రమణదారుడు ఖాళీ చేసి వెళ్లారు. అయితే ఆ కార్యాలయం ముందువైపు రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో నలుగురు వైసీపీ నేతలు ఏకంగా షాపులు నిర్మించి, వ్యాపారం చేసుకుంటున్నారు. అయితే కొందరు వైద్యాధికారులు ఈ ఆక్రమణలపై ప్రశ్నించగా వారు దౌర్జన్యాలకు దిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆయా దుకాణదారులు ఆక్రమణలను తొలగించక పోవడం గమనార్హం.



వైద్యఆరోగ్యశాఖ స్థలం ఆక్రమించి నిర్మించిన దుకాణాలు

పాలకులు, అధికారుల దృష్టికి..

వైద్యఆరోగ్యశాఖకు చెందిన స్థలంలో అక్రమంగా షాపులు నిర్మించారని, మంత్రి నారాయణతోపాటు కలెక్టర్ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఇంతవరకు ఆక్రమణలను తొలగించలేదు. వీటిని వెంటనే తొలగిస్తే, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఇతర అవసరాలకు వాడుకుంటాం. ఈ దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

- డీఎంహెచ్‌వో, డాక్టర్ సుజాత





హర హర మహాదేవ

భక్తులతో పోటెత్తిన శైవాలయాలు

శివనామస్మరణతో మార్మోగిన శ్రీకాళహస్తి

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 11 గంటలకు: రథోత్సవం

రాత్రి 8.00 గంటలకు: తెప్పోత్సవం

రాత్రి నందిసేవ

భక్తకోటిని అనుగ్రహించేందుకు బుధవారం రాత్రి నందివాహనంపై స్వామివారు, సింహవాహనంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఊరేగింపును తిలకించేందుకు.. జాగరణచేసి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, మాడ వీధులు కిక్కిరిసిపోయాయి.



కళాకారుల విన్యాసం



వాహన సేవ ముందు భక్తుల నృత్యం



భక్తుల మొక్కులు



నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): 'హరహర మహాదేవ.. శంభోశంకర' అంటూ జిల్లాలోని ఈశ్వరాలయాలు బుధవారం శివనామ స్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు రావడంతో రద్దీగా కనిపించాయి. దక్షిణ కైలాసంగా పేర్కొనే శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. స్వర్ణముఖి నదిలో స్నానాలు.. పితృదేవతలకు తర్పణం వదిలేవారు.. శంఖం పూరించే జంగమదేవరలు.. స్వామి దర్శనానికి వచ్చిన జనంతో పురవీధులు రద్దీగా మారాయి. మహాశివరాత్రి సందర్భంగా వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజు నాలుగు కాలాల అభిషేకాలు జరిగితే.. శివరాత్రి నాడు మాత్రం (బుధవారం ఉదయం నుంచి గురువారం వేకువన లింగోద్భవం వరకు) 11 కాలాభిషేకాలు నిర్వహించారు. ఇక, బుధవారం వేకువజామున 2 గంటలకు అర్చకులు స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. పూజల అనంతరం 3 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రుద్రాభిషేకంతో పాటు పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకం ఒకదాని వెంట ఒకటి స్వామివారికి నిర్వహించారు. వీటితో స్వామివారు నిత్యాభిషేక మూర్తిగా దర్శనభాగ్యం కల్పించారు. జ్ఞానప్రసూనాంబిక దేవికీ అభిషేకాలు నిర్వహించారు.

వేకువజామున 4 గంటల నుంచే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయం లోపల భక్తులకు మహాలఘు దర్శన విధానం అమలు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయలింగం నుంచి ఆలయం పైకి వెళ్లి భక్తకన్నప్ప కొండమెట్ల మార్గం వద్దకు చేరుకునేలా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసి మహాద్వారం వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో తోపులాటకు తావులేకుండా పోయింది. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్లు అందజేశారు. సుమారు లక్షన్నర మంది భక్తులు వచ్చినట్లు ఆలయాధికారుల అంచనా.

మహాప్రసాదంగా వాయనం

ఈసారి భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. మహిళలకు రవికతో పాటు పసుపు, కుంకుమ, గాజులను కలిపి వాయనంగా అందించారు. క్యూలైన్లలో భక్తులకు వాటర్‌బాటిళ్లు, బిస్కెట్లు అందజేశారు.



మహిళా భక్తులకు వాయనం అందజేత

ఇంద్ర విమానంపై శివయ్య

బుధవారం ఉదయం ఇంద్ర విమానంపై స్వామి, చప్పరంపై జ్ఞానప్రసూనాంబ దేవి అధిరోహించారు. మూషికవాహనంపై వినాయకుడు, శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై ఊరేగింపులో ముందు సాగారు. ఊరేగింపు ముందు కళారూప ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ ఈవో బాపిరెడి, ఉభయదారులు పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు

మహాశివరాత్రికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ నుంచి ఎస్పీ హర్షవర్ధనరాజు క్యూలైన్లను, క్రౌడ్ కంట్రోల్‌ను పర్యవేక్షించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. క్యూలైన్ల వద్ద తోపులాటలు జరగకుండా చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి పరిసరప్రాంతంలలో 398 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పురవీధులలో డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేశారు. ట్రైనీ ఎస్పీ బి.హేమంత్, అదనపు ఎస్పీలు కె.రవిమనోహరాచారి, ఐ.రామకృష్ణ, డీఎస్పీలు నరసింహ మూర్తి (శ్రీకాళహస్తి), రామకృష్ణచారి (తిరుపతి ట్రాఫిక్) చెంచుబాబు (నాయుడుపేట), విజయ్‌శేఖర్ (తిరుమల), సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.





పిండప్రదానాలు



సాయంత్రం నుంచి ట్రాఫిక్ చిక్కులు

శ్రీకాళహస్తిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ అదుపులోనే కొనసాగింది. సాయంత్రం ఆరు గంటల తర్వాత పట్టణవాసులు ద్విచక్ర వాహనాలు, కార్లతో అధిక సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. దీంతో మాడవీధుల్లో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. పెళ్లి మండపం, సూపర్ బజార్ కూడలి, రాజగోపురం, బిక్షాల గాలిగోపురం, బేరివారి మండపం, జయరామరావు వీధిలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ట్రాఫిక్ సమస్యను గుర్తించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.











తిరుపతి నగరం కపిలేశ్వరాలయంలో శివలింగం, నాగపడిగల వద్ద భక్తుల పూజలు.. దర్శనానికి పోటెత్తిన భక్తులు - నాగలాపురం మండలం సురుటుపల్లెలోని పల్లికొండేశ్వరాలయంలో స్వామి దర్శనానికి వెళుతున్న భక్తులు - తలకోనలోని సిద్దేశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులు

వైభవంగా పురుషోత్తముడి చక్రస్నానం

- ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 6.30-7.30 గంటల మధ్య చక్రతాళ్వార్‌తో పాటు ఉత్సవర్లను పల్లకిలో మాడవీధుల్లో ఊరేగించారు. 9 నుంచి 10 గంటల వరకు కంకణ భట్టర్ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవర్లను పుష్కరిణి వద్ద ప్రత్యేక వేదికపై కొలుదీర్చారు. స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య చక్రతాళ్వార్‌కి చక్రస్నానం నిర్వహించారు. అదే సమయంలో భక్తులూ పుష్కరిణిలో స్నానమాచరించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, అర్చకులు బాలాజీచార్యులు, పార్థసారథి, శేషాచార్యులు, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్ పాల్గొన్నారు.



పుష్కరిణిలో చక్రతాళ్వార్‌కు చక్రస్నానం తర్వాత స్నానమాచరిస్తున్న భక్తులు

క్యాన్సర్ బాధితులకోసం శ్రీబయో

- మరో రెండు నెలల్లో అందుబాటులోకి
- స్విమ్స్ వార్షికోత్సవంలో డైరెక్టర్ ఆర్వీ కుమార్
- 9 మందికి గోల్డ్ మెడల్.. 35 మంది వైద్యులకు ప్రశంసాపత్రాల ప్రదానం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(శ్రీబయో)ని మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ పేర్కొన్నారు. తిరుపతిలోని మహతిలో బుధవారం జరిగిన స్విమ్స్ 32వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఒకే రోజు మూడు కీలకమైన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ఘనత స్విమ్స్‌కే దక్కిందన్నారు. స్విమ్స్‌ను దేశంలోనే అత్యుత్తమ వైద్య విజ్ఞాన సంస్థగా అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రభుత్వం, టీటీడీ తోడ్పాటు అందిస్తున్నాయన్నారు.

త్వరలోనే ఆప్తమాలజీ, ఈఎన్‌టీ విభాగాల పీజీ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. డీన్ అల్లాడి మోహన్‌తో కలిసి స్విమ్స్ యూనివర్సిటీ నివేదిక సీడీలను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన ఏడుగురు వైద్యులకు, ఒక ఎంబీబీఎస్ విద్యార్థినికి, ఒక స్టాఫ్‌నర్సుకు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. మరో 35 మంది వైద్యులకు ప్రశంసాపత్రాలు అందించారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, ఎంఎస్ రామ్, ప్రిన్సిపాల్స్ ఉషా కళావత్, మాధవి, సుధారాణి, వైద్య విభాగాధిపతులు వనజాక్షమ్మ, మధుబాబు, పీవీజీకే శర్మ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక నివేదిక సీడీలను ఆవిష్కరిస్తున్న ఆర్వీకుమార్, డీన్ అల్లాడి మోహన్

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువకుడు 12 ఏళ్ల బాలికపై 2019లో అత్యాచారం చేశాడు. దీనిపై స్థానిక పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం వాయిదాకు రాగా, పూర్వాపరాలు పరిశీలించాక నేరం రుజువుకావడంతో యువకుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పు చెప్పారు. ఈ కేసును స్పెషల్ పీపీ మోహన కుమారి వాదించారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు



రైల్వేస్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం నరేంద్రపాటిల్

గూడూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు చేపడతామని సౌత్‌సెంట్రల్ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్ అన్నారు. బుధవారం గూడూరు రైల్వేస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సిగ్నలింగ్ వ్యవస్థను, ప్రయాణికులు వేచివుండే గదులను పరిశీలించారు. స్టేషన్‌లో సమస్యలను గుర్తించి నివేదిక అందజేస్తే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే పరిధిలోని పొన్నేరి, కవరేపేట మధ్య జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల నేపథ్యంలో గురువారం పలు రైళ్లు రద్దు కానున్నాయి. రైళ్ల వేగ నియంత్రణలో భాగంగా పలుచోట్ల పట్టాల మార్పిడి పనులు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 9:15 గంటల నుంచి సాయంత్రం 3:15 గంటల వరకు సూళ్లూరుపేట - చెన్నై మధ్య రైళ్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. చెన్నై - సూళ్లూరుపేట లోకల్ రైళ్లు, నెల్లూరు - చెన్నై మెమో రైళ్లు ఉదయం 8 గంటల నుంచే రద్దు కానుండగా, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను గూడూరు వరకు నడపనున్నారు. ఇక విజయవాడ వైపు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొంత ఆలస్యంగా నడవనున్నాయి.

మోగిన సీసీ కెమెరా సైరన్.. దొంగ పరార్



దుకాణం వద్ద సీసీ కెమెరాలో రికార్డైన దొంగ చిత్రం

దొరవారిసత్రం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండల కేంద్రంలో దొంగల బెడద ఎక్కువైంది. రాత్రి వేళల్లో రహదారి పక్కన ఉన్న దుకాణాలు, ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి మండల కార్యాలయ కూడలిలో జాతీయ రహదారికి పక్కన ఉన్న మూడు దుకాణాల్లో చోరీ ప్రయత్నం చేశారు. ఓ దుకాణంలో సీసీ కెమెరా సైరన్ మోగడంతో అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. గతంలో ఇదే ప్రాంతంలోని ఓ ఇంట్లో నగదు అపహరణ, సొసైటీ కార్యాలయంలో చోరీకి యత్నం, అక్కడే ఉన్న ఆర్వో వాటర్ కార్యాలయంలో నగదు చోరీకి గురైంది. దొంగల బెడద ఎక్కువ కావడంతో పోలీసులు రాత్రివేళ గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



గుంతలోకి దూసుకెళ్లి ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాజీకండ్రిగ సమీపాన ఆర్టీసీ బస్సు గుంతలోకి దూసుకెళ్లిన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. నాయుడుపేట నుంచి ప్రయాణికులతో వెంకటగిరికి వెళ్తున్న బస్సు తిమ్మాజీకండ్రిగ సమీపంలో ఎదురుగా వస్తున్న ధాన్యం ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి ఒరిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలిపివేయడంతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు.

ఎమ్మెల్యే పాశింకు సన్మానం



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న చెన్నూరువాసులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు హరిజనవాడలో నివాస గృహాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మార్పించినందుకు ఆ గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చెన్నూరు హరిజనవాడలోని నివాస గృహాలపై 11 కేవీ విద్యుత్ వైర్లు వెళుతుండడంతో స్థానికులు ప్రమాదాలకు లోనవుతూ, భయాందోళనలు చెందుతూ జీవనం సాగించేవారన్నారు. సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో విద్యుత్‌శాఖ అధికారులతో చర్చించి విద్యుత్ వైర్లను మార్పించామన్నారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల కమిటీ అధ్యక్షుడిగా రహీం



అబ్దుల్‌రహీంను సన్మానిస్తున్న ముస్లింలు

వాకాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జామీయా మసీదులో బుధవారం నియోజకవర్గ మసీదుల కమిటీ(ముతవల్లి కమిటీ) సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా గూడూరుకు చెందిన అబ్దుల్ రహీం, ఉపాధ్యక్షుడుగా కోట మండలానికి చెందిన మస్తాన్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన జిలానీబాషా, కార్యదర్శిగా వాకాడుకు చెందిన అమీర్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అబ్దుల్‌రహీం మాట్లాడుతూ నియోజవకర్గ పరిధిలోని మసీదుల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మౌజన్, ఇమామ్‌ల జీతభత్యాల విషయాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రహీంను సన్మానించారు.



గూడూరు: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు





చిట్టమూరు: యాకసిరితిప్పపై శివలింగాలను దర్శించుకుంటున్న భక్తులు - తడ: చిన్నమాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయంలో గోపూజ

మార్మోగిన శివనామస్మరణ

గూడూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని శివాలయాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు. శివలింగాలకు అభిషేకాలు చేసి హోమ పూజలు జరిపారు. స్థానిక భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరస్వామి (పెద్దశివాలయం)లో విశేష కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణమహోత్సవం, లింగోద్భవకాల రుద్రాభిషేకం, స్వామి, అమ్మవార్ల మాడ ఉత్సవం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక మీనాక్షీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పాలతో అభిషేకాలు జరిపారు. వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. రెండోపట్టణ పరిధిలోని కామాక్షీదేవి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శివపార్వతులకు వైభవంగా కల్యాణ మహోత్సవం జరిపారు. సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి అన్నాభిషేకం జరిపి హోమపూజలు నిర్వహించి వైభవోపేతంగా శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనాన్ని ఏర్పాటు చేశారు. చెన్నూరులోని కామాక్షీ సమేత సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐసీఎస్ రోడ్డులో పేటేటి రమణయ్య జ్ఞాపకార్థం ఆయన నివాసం వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.

చిల్లకూరు: చేడిమాలలోని కామాక్షీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. రామాంజనేయ యుద్ధ నాటకాన్ని ప్రదర్శించారు. బూదనంలోని భవానీ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకాలు, భవానీశంకర్ ఆలయంలో రుద్రాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కాశీ విశ్వనాధస్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయం, కర్ణకమ్మవీధిలోని హరహర క్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద భ్రమరాంబ మల్లిఖార్జున ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఓజిలి: మండలంలోని ఓజిలి, ఆరిమేనిపాడు, సగుటూరు, కరబల్లవోలు, అత్తివరం గ్రామాల శివాలయాల్లో పూజలు చేశారు. భట్లకనుపూరులో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం లింగోద్భవకాల రుద్రాభిషేక, రాత్రి స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గున్నంరెడ్డి మధుసూధనరెడ్డి కుటుంబీకులు 50 కిలో వెండి ఆభరణాలు, ఆలయ ఉపకరణాలుగా పాత్రలు అందజేశారు. పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో రవికృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్‌ఐ స్వప్న ఆలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న గంగాపార్వతీ సమేత త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మూల విరాట్ శివలింగాన్ని పాలు, నూనె, తేనె, పంచామృతం, పండ్ల రసాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారికి అరుణోదయాభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం తపనో దయాభిషేకం, సాయంత్రం ప్రదోష కాలాభిషేకం, రాత్రి స్వామివారికి లింగోద్భవ పూజలు చేశారు. అదేవిధంగా మన్నారుపోలూరు కాళంగి నదీ తీరాన వెలసిన సంతానేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారు జామున నుంచే భక్తులు పోటెత్తారు. సంతాన ప్రాప్తికోసం వందలాది జంటలు బిందెలు, చెంబులతో కాళంగి నది జలాలను స్వయంగా తెచ్చి శివలింగాన్ని అభిషేకించారు. సూళ్లూరుపేట టీడీపీ కార్యాలయం వద్దనున్న బ్రహ్మసూత్రం కలిగిన అభయ శంకరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కొరిడి నీలకంఠేశ్వరస్వామి, కుదిరి మల్లికార్జునేశ్వరస్వామి, కోటపోలూరులోని ఖరేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. నాగేశ్వరస్వామిని ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పాళ్ల శ్రీహరి రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతనిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, చెంగాళమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్లురెడ్డి, చెన్నంశెట్టి శ్రీనివాసులు, ఎన్.రాము, ఎం.శాంతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: సాయిసత్సంగ నిలయంలో శివలింగానికి పసుపుతో అభిషేకం

నాయుడుపేట: స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని ప్రసూనాంబ సమేత నీలంకంఠేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం, లలితా హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. పాత బ్రాహ్మణ వీధిలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కలిశప్రతిష్ఠ, గణపతి పూజ, స్వామివార్లకు క్షీరాభిషేకం చేశారు. శివాలయం వీధిలోని జంభుకేశ్వర ఆలయంలో గణపతి పూజ, క్షీరాభిషేకం నిర్వహించారు. తుమ్మూరులోని గంగా కామాక్షీ సమేత నీలకంఠేశ్వస్వామి ఆలయంలో మహాగణపతికి అభిషేకం, నందివాహన సేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గూడూరు ప్రభావతి, సుధీర్‌రెడ్డి, ఉగ్గుమూడి భాస్కర్ రెడ్డి, అవధానం సుధీర్, అమరేంద్రరెడ్డి, వేదపండి తులు సురేష్‌శర్మ, బాలజీస్వామి, సునీల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలోని అడవి అగ్రహారం శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీధనమల్లి శివాలయం, పూలతోట, తనియాలి, ఉచ్చూరు, ఏకొల్లు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉచ్చూరులోని పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం నిర్వహించారు.

తడ: చినమాంబట్టులో వెలసిన కాశీవిశ్వేర అన్నపూర్ణాదేవి ఆలయంలో పాలాభిషేకం, రుద్రాభిషేకం, గోపూజ నిర్వహించారు. బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి మధ్నాహ్నం వరకు పాలభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని చందనంతో అలంకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం నిప్పో పరిశ్రమ ఎండీ గొట్టిపాటి ద్వారాకనాథరెడ్డి సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. వాటంబేడులోని విశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే విజయశ్రీ, తిరుపతి స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి, నిప్పో పరిశ్రమ ప్లాంట్ హెడ్ నాగరాజు, వెంకురెడ్డి, బాలిరెడ్డి, బొమ్మన పళని, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని మోదుగులపాలెం, పెళ్లకూరు, చింతపూడి, శిరసనంబేడు, తాళ్వాయిపాడు, చెంబేడు గ్రామాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు, గణపతి హోమాలు, గోపూజ, అభిషేకాలు చేపట్టారు.

చిట్టమూరు: మండలంలోని శైవక్షేత్రాలకు భక్తులు పొటెత్తారు. యాకసిరి భూపతేశ్వర స్వామి, పాటిమిట్ట నగరేశ్వర స్వామి, గునపాడు వల్మీకి నాగేశ్వర స్వామి, మల్లాం మార్కెండేయ స్వామి, పెళ్లకూరు మల్లీశ్వర స్వామి, మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నాయుడుపేట మండలం జువ్వలపాళెం నుంచి భూపతేశ్వర స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ఊరేగింపుగా యాకసిరి తిప్పకు చేరుకుంది. ఎస్‌ఐ చిన్నబలరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోట: గూడలిలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కామాక్షీ సమేత సంగమేశ్వరాలయం, నూరిశెట్టిపాళెంలో మహాలింగేశ్వరుడు, కొక్కుపాడులో సంతానేశ్వరుడు, అల్లంపాడులో జలసిద్దేశ్వరుడు, పుచ్చలపల్లిలో శ్రీకాళహస్తీశ్వరుడు, వంజివాకలో జలసిద్దేశ్వరుడు, ఊనుగుంటపాళెంలో సుందరేశ్వరుడి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. బాలాజీ శెట్టి, సురేష్‌రెడ్డి, దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది. కోటలోని సోమేశ్వరాలయంలో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

వాకాడు: పంట్రంగంలోని కామాక్షీ సమేత పాండురంగేశ్వరస్వామి, వాకాడులోని బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం, నెల్లిపూడిలోని జలసిద్దేశ్వర ఆలయం, జువ్వినట్టు, తిరుమూరు, తూపిలి, దుగరాజపట్నం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శివ పంచాక్షరి జపాలు, నందేశ్వర పారాయణాలు, పంచసూక్తాలు పఠించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, గణపర్తి కిషోర్ నాయుడు, పురుషోత్తం రెడ్డి, అజిత్‌కుమార్‌రెడ్డి, విజయరత్నం, చంద్రభూషణ్‌రెడ్డి, చంద్రారెడి, సుదాకర్‌రెడ్డి పంట్రంగంలోని పాండురంగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.











దొరవారిసత్రం: ప్రత్యేక అలంకరణలో శివలింగం, సూళ్లూరుపేట: నాగేశ్వరస్వామికి పుష్పాలంకరణ, వెంకటగిరి టౌన్: శివుడికి ప్రత్యేకాలంకరణ, కోట: విశేషాలంకరణలో సంగమేశ్వరుడు, వాకాడు: పాండురంగేశ్వరస్వామి









పెళ్లకూరు: చింతపూడి శివాలయంలో భక్తుల పూజలు, ఓజిలి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో భక్తులకు హారతి, చిల్లకూరు: చేడిమాల నాగలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, నాయుడుపేట: రుద్రహోమం

కమనీయం.. శివపార్వతుల కల్యాణం





పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ - స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

డక్కిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునివెల్లంపల్లిలోని స్తంబాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో ఉదయం 5గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, 6గంటలకు పూజ, నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి స్వామి అమ్మవార్లకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు ఇంటి వద్ద నుంచి పట్టు వస్త్రాలతో బయలుదేరిన ఎమ్మెల్యేకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామి, అమ్మవార్లకు ధరించి కల్యాణం జరిపించారు. కల్యాణం పూర్తయ్యాక తలంబ్రాల కోసం భక్తులు పోటీపడ్డారు. రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈవో శ్రీనివాసులు, వెంకటగిరి సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ శివశంకర్ భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, ఈశ్వరయ్య స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ నర్రావుల ప్రకాశం నాయుడు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, జనసేన నాయకులు జంపాల ప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, తెలుగు యువత టీడీపీ మండల అధ్యక్షుడు వేముల కిశోర్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

కుల ధ్రువీకరణకు డిజిటల్ కష్టాలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి తహసీల్దార్ సంతకం డిజిటలైజేషన్ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా కుల ధ్రువీకరణ, ఆదాయం తదితర సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రాల వద్దకు తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో పడి గాపులు కాయాల్సిన వస్తోంది. అవ్యవసర పరిస్థితుల్లో ఆదాయ సర్టిఫికెట్ మాన్యువల్‌గా తీసుకోవాలంటే వీఆర్‌వోలు రూ.వెయ్యి డిమాండ్ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ పథకాలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ ప్రభుత్వం అందించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఉంటేనే పంటల బీమా, పీఎం కిసాన్, రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, పంట రుణాలు, రాయితీ విత్తనాలు, ఎరువులు అందుతాయన్నారు.

వైభవంగా భూపతేశ్వరస్వామి నగరోత్సవం



నగరోత్సవంలో గౌరీ సమేత భూపతేశ్వరస్వామి

నాయుడుపేటటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గౌరీ సమేత భూపతేశ్వస్వామి నగరోత్సవాన్ని గురుస్వామి కొప్పోలు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నాయుడుపేట జువ్వలపాళెం నుంచి పట్టణంలోని పలు వీధులు, మండలంలోని పుదూరు, అత్తలపాళెం, చిట్టమూరు మండలం పాటిమిట్ట మీదుగా ఏకశిరి తిప్పవరకు భూపతేశ్వరస్వామి నగరోత్సవం వైభవంగా సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా భీమేశ్వరుడి కల్యాణం

కోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి తిప్పపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరుడి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. పర్వత రాజు తన కుమార్తె పర్వతవర్ధినిని పెళ్లి చేసుకోమని భీమేశ్వరుడిని బ్రతిమలాడే సన్నివేశాలను వేదపండితులు కళ్లకు కట్టినట్లు చూపించారు. వివాహానంతరం స్వామి అమ్మవార్లు గూడలి పురవీధుల్లో ఊరేగారు. ఊనుగుంటపాళెంలో అర్చకుడు నరేష్‌స్వామి ఆధ్వర్యంలో సుందరేశ్వరుడి కల్యాణం జరిగింది.



పర్వతవర్ధిని, భీమేశ్వరుడి కల్యాణం జరుపుతున్న వేదపండితులు